క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సిఫారసుతో మంజూరైన రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావు, సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్‌లు శుక్రవారం కొణిజర్లలో లబ్ధిదారులకు అందజేశారు. అలాగే, పెద్దమునగాలలో ఎనిమిది మందికి రూ.4.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులుకంచు బీరయ్య, బైరం బాలరాజు, తలారి చందు, దాసరి వీరబాబు, సోలా శ్రీను తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని బస్వాపురం, లింగగూడెం వాసులకు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో మంజూరైన రూ.4 లక్షలు విలువ గల చెక్కులను ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. నాయకులు తూము అప్పారావు, నల్లమోతు లక్ష్మయ్య, చౌడవరపు నరసింహారావు, చల్లా భాస్కర్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

కల్లూరు: సివిల్ సప్లయ్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు సివిల్ సప్లయ్ గోదాము వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎగుమతులకు, దిగుమతులకు క్వింటాకు రూ.35 ఇవ్వాలని ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఖమ్మంపాటి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

ముదిగొండ: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని చిరుమర్రి, పమ్మి, కమలాపురం, గంధసిరి, న్యూలక్ష్మీపురం గ్రామాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఏలను విడుదల చేయటంతోపాటు అన్ని పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి అంజనికృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు రంగనాథ్, జిల్లా కార్యదర్శి వీరభద్రం, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

ముదిగొండ: మండలంలోని 25గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాను శుక్రవారం ప్రదర్శించినట్లు ఎంపీఓ వాల్మీకి కిషోర్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం కొన్ని రోజులుగా గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను రూపొందించింది. ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

అక్కులు సేవలు మరువలేనివి

మధిర: ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు మధిర ప్రాంతంలో అనేక ఉద్యమాలు నిర్వహించిన గద్దల వెంకటేశ్వరరావు అలియాస్ అక్కులు సేవలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైడికత్తుల ఈదయ్య మాదిగ తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అక్కులు కుటుంబాన్ని శుక్రవారం వారు పరామర్శించి నివాళులర్పించారు. మధిర దళిత కాలనీకి చెందిన అక్కులు అనేక పోరాటాలు నిర్వహించి ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సునీల్ మాదిగ, మండల అధ్యక్షులు రాజేష్ మాదిగ, నరసింహారావు మాదిగ పాల్గొన్నారు.


రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ముదిగొండ: ముదిగొండ నుంచి వెంకటగిరి వరకు పాత రోడ్డు అధ్వానంగా ఉండి గుంతలు పడడంతో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశ్రామిక ప్రాంతంలో నిరసన చేపట్టారు. ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై భారీ వర్షాలు వల్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డుపై మోకాళ్లలోతు నీళ్లలో నిల్చుని నిరసన ప్రదర్శన చేపట్టారు. తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజు, సతీష్, సురేష్, నాగరాజు, నాగేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బెటాలియన్ హోంగార్డు మృతి

సత్తుపల్లిరూరల్: గంగారం బెటాలియన్‌లో పని చేస్తున్న పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన హోంగార్డు బత్తుల నాగేశ్వరరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని హోంగార్డు ఇన్‌చార్జ్, హెడ్‌కానిస్టేబుల్ నవీన్ సందర్శించి.. హోంగార్డుల సంఘం తరుపున రూ.10వేలు అందించారు. ఖమ్మంజిల్లా హోంగార్డు ఆఫీసర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు శ్రీను, ఈ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యం.. వ్యాపారం



- ప్రైవేట్ ఆస్పత్రుల్లో మోసాలు
- సాధారణ జబ్బులకే రూ.వేలల్లో బిల్లులు
- ఆర్థికంగా కుదేలవుతున్న ప్రజలు

సత్తుపల్లి: సత్తుపల్లిలో వైద్యం వ్యాపారంగా మారింది. మారుమూల పల్లెల్లో ప్రథమ చికిత్స అందించే ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రైవేట్ వారితో సంబంధాలు పెట్టుకుని ఏజెంట్లుగా వ్యవహరిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. ఎటువంటి అనుమతులు లేని మరికొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు దర్జాగా వైద్యం చేస్తున్నారు. ఈ వైనం ఒక్కొక్కటిగా బట్టబయలు అవుతున్నాయి. అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తే కొంతలో కొంతైనా మార్పు వస్తుందేమోనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇబ్బడిముబ్బడిగా ఆస్పత్రులు..

ఖమ్మం తర్వాత సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలో ప్రైవేట్ వైద్యశాలలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. వైద్యం కోసం రోజుకు కనీసం వెయ్యిమందికి పైగా సత్తుపల్లికి వస్తుంటారు. ఏ ఆస్పత్రికి వెళ్లినా ఓపీ రూ.200పైనే ఉంటుంది. ఆస్పత్రి ఫీజు, మందులు, పరీక్షలంటూ.. రోజుకు లక్షల్లో బాధితుల సొమ్ము కొల్లకొడుతున్నారు.

కానరాని సిటిజన్ చార్టర్..

ఏ జబ్బుకు ఎంత ఫీజు తెలిపే కనీస సమాచార సిటిజన్ చార్టర్‌ను నిర్వహించలేని దుస్థితిలో కొన్ని ప్రైవే ట్ ఆస్పత్రులు ఉన్నాయి. చాలా ఆస్పత్రుల్లో ఏమాత్రం అవగాహన లేని నర్సింగ్ సిబ్బంది వైద్య సేవలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో ఊహించుకోవచ్చు. సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రులో ఒక రోజు బెడ్ ఛార్జ్ రూ.3,500, సర్వీస్ ఛార్జ్ రూ.2,500 చొప్పున వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. చాలా ఆస్పత్రుల్లో ఇన్ పేషెంట్లను చేర్చుకొని వైద్యం చేసే అనుమతి లేకపోయినా ఆస్పత్రి స్థాయిని మించి బెడ్లు వేస్తూ ఫీజులు గుంజుతున్నారనే విమర్శ వినిపిస్తుంది.

**బోర్డులో ఒకరు..
వైద్యం మరొకరు..**

సత్తుపల్లి పట్టణంలో కొన్ని ఆస్పత్రుల్లో బోర్డుమీద డాక్టర్ పేరు ఒకటి ఉంటే.. వైద్యం చేసే డాక్టర్ మరొకరు ఉండటం.. కనీసం ఆ డాక్టర్లకు సంబంధించిన డాక్యూమెంట్లు కూడా కనిపించని పరిస్థితిలో వైద్యం నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు ఆస్పత్రుల్లోనైతే ల్యాబ్, మెడికల్ షాపులు నిర్వహిస్తుండడంతో.. పరీక్షల పేరుతో రోగులను పిండి పిప్పి చేస్తున్నారు. ఇక జ్వరం వస్తే ఆస్తులు అమ్ముకోవాలి అన్నట్టుగా ఉంది ఇక్కడి పరిస్థితి.

డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ..

జ్వరపీడిత బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను కల్లూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ టి.సీతారాం ఆకస్మికంగా చేసిన చేశారు. ఈ క్రమంలో ఆస్పత్రులకు.. ఆస్పత్రి రిజిస్ట్రేషన్, వైద్యుల లీజ్ అగ్రిమెంట్, ల్యాబ్, ఆస్పత్రి పరిసరాలు, స్టాఫ్, మెడికల్ షాప్ నిర్వాహణలపై నోటీసులు జారీ చేశారు. అనధికారికంగా వైద్యం చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లీజ్ అగ్రిమెంట్ ప్రకారం వైద్యులు చికిత్స చేయాలని, వైద్యులు మారినప్పుడు బోర్డుపై పేరు మార్చాలన్నారు. ఇష్టారీతిన చికిత్స అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పోషకాహారం తీసుకోండి


సత్తుపల్లిటౌన్: సామూహిక సీమంతాలు చేస్తున్న సీడీపీఓ కనకదుర్గ


కల్లూరురూరల్: అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ నిర్మల జ్యోతి

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకున్నట్‌లైతే ఆరోగ్యవంతంగా ఉంటాని సత్తుపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో సత్తుపల్లి సెక్టార్, కిష్టారంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు సుజాత, కె.రజిని పోషకవిలువలు కలిగిన ఆహార పదార్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని కల్లూరు ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల జ్యోతి స్పష్టం చేశారు. ఏసీడీపీఓ రత్నమ్మ ఆధ్వర్యంలో చంద్రుపట్ల సెంటర్‌లో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాత, సంధ్యారాణి, సత్యవతి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ హరీష్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, మంగ, లక్ష్మి, కృష్ణవేణి, యశోద తదితరులు పాల్గొన్నారు.

బనిగండ్లపాడు గ్రామంలో..

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ టీచర్లు మహాలక్ష్మి, మేరిజ్యోతి, మేరికాంతం, ఉమామహేశ్వరి, ఆశా వర్కర్లు సుధారాణి, ధనలక్ష్మి, సుజాత తదితరులున్నారు.

వైరారూరల్: మండలంలోని పాలడుగు అంగన్‌డీలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో.. చిన్నారులకు ఆటలు, ఈసీసీఐపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్.బీజాన్‌బీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పూజలు.. అన్నదానాలు

మండలంలో గణేష్ నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వినాయక మండపాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాలను పలువురు నాయకులు, అధికారులు ప్రారంభించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఈత వచ్చిన వాళ్లు మాత్రమే చెరువులు, కాలువలలోకి దిగి నిమజ్జనం చేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మల్లు నందిని


వైరా: 20వ వార్డులో అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్


వైరారూరల్: దాచాపురంలో..


బోనకల్: గణనాథుడి వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం


ఏన్కూరులో అన్నం వడ్డిస్తున్న ఎస్సై రవికుమార్

గణేష్ ఉత్సవాలపై సమీక్ష

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో గణేష్ ఉత్సవాలపై గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో వైరా సీఐ సాగర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన ఊరేగింపులో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, డీజేలకు అనుమతి లేదని, రాజకీయ పార్టీల పాటలను అనుమతించమని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో చింతకాని ఎస్సై నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైరా సీఐ సాగర్

24 నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు


మాట్లాడుతున్న ఎంఈఓ దామోదరప్రసాద్

తల్లాడ: మండలంలోని పినపాక డాన్‌బోస్కో పాఠశాలలో.. వైరా జోనల్ స్థాయి గేమ్స్ 24,25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ అన్నారు. శుక్రవారం తల్లాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైరా జోనల్ గేమ్స్‌లో అండర్ 17, అండర్ 14 బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వైరా జోనల్ గేమ్స్ కన్వీనర్‌గా తల్లాడ హెచ్ఎం ప్రసూన, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాపారావును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్, క్రిష్ణమూర్తి, శిరీష, నాగమణి, ఎస్.కె.రంజాన్, నరసింహరావు, వెంకటేశ్వర్లు, వీరయ్య, రమేష్, నరసయ్య పాల్గొన్నారు.

19నుంచి మండలస్థాయి..

ముదిగొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాణాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 19, 20వ తేదీల్లో మండలస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు క్రీడా పోటీల కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్14, అండర్17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 19న బాలికలకు, 20న బాలురకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శులు

ఏన్కూరు: మండలంలోని గ్రామ పంచాయతీలకు నూతన కార్యదర్శులు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన 24 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వివిధ మండలాలకు వెళ్లారు. దీంతో నూతన పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

సాహిత్యంతో ప్రజల్లో చైతన్యం

మధిర: సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావచ్చునని ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల తెలుగు సహాయ ఆచార్యులు డాక్టర్ ఇనపనూరి విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాహిత్యం – ప్రయోజనాలు అనే అంశంపై తెలుగు విభాగం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు ప్రజలను చైతన్యవంతులను చేసేది సాహిత్యమే అని అన్నారు. అనంతరం డాక్టర్ ఇనపనూరి విజయ్ కుమార్‌ని విద్యార్థులు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ శీలం ఇందిర ఆధ్వర్యంలో విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

కులమతాల హద్దులు లేనిదే సంగీతం

సత్తుపల్లిరూరల్: సంగీతానికి కులమతాల హద్దులు ఉండవని, సకల మానవాళిని రంజిప చేయటమే దాని పరామావధని ప్రముఖ గాయని ఎస్‌కె భేగం అన్నారు. స్థానిక జవహర్ నగర్ శ్రీకృష్ణమందిరంలో శుక్రవారం భక్తి గీతాల సంగీత విభావరి నిర్వహించారు. బేగం, కె.సీతారావమ్మ, మాధవి బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వాహకులు వీరిని సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కె.రమేష్, రామకృష్ణ, శైలజ, వెంకటేశ్వరరావు, బి.మధుసూదన్‌రాజు, కుమారి, సరోజిని, ఇందిర పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ఘనంగా హిందీ దివస్


రేజర్ల పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీదివస్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 6 ,7, 8వ, 9వ తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో హిందీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అదే విధంగా స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్.గోపి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ కె.పద్మరాణి, వైస్ ప్రిన్సిపాల్ వి.రవిశంకర్, పీర్‌సాహెబ్, నాగిరెడ్డి, హిందీ ఉపాధ్యాయుడు నేరేటి కామేశ్వరరావు, హెచ్ఎం నాగమణి, అమరారెడ్డి, చెన్నకేశవరెడ్డి, కమలకుమారి, చారి, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రావినూతన పాఠశాలలో..

బోనకల్: మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు ఎండీ గౌసుద్దీన్ ఆ బాష గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులకు కవితలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుల్లయ్య, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

గుబ్బగుర్తి పాఠశాలలో..


గుబ్బగుర్తి ఉన్నత పాఠశాలలో..

కొణిజర్ల: మండలంలోని గుబ్బగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు నెమలికొండ పుల్లయాచారి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ పఠనం, ఉపన్యాసం, కవితాపోటీలు నిర్వహించి.. బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పమ్మి శివనారాయణ, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యడవల్లి జెడ్పీ పాఠశాలలో..

ముదిగొండ: మండలపరిధిలోని యడవల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లా, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు వితరణ

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం వరద బాధితులకు ఖమ్మం లయన్స్ భవనం వద్ద 150 మందికి దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో రీజనల్ చైర్ పర్సన్ డీపీసీ రావు, ఖమ్మం లయన్స్‌క్లబ్ సభ్యులు శ్రీరామ్, విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు, జనార్దన్ రావు, శ్రీనివాసరావు, హనుమంతురావు, వెంకట్ రెడ్డి, కనకదుర్గ ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

దుస్తుల సేకరణ, పంపిణీ..

కల్లూరు: మున్నేరు వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేసేందుకు కల్లూరు మండలంలోని పలు గ్రామాల నుంచి వాల్ ఆఫ్ కైండ్‌నెస్ నిర్వాహకులు దంతాల సుధాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అమర్లపూడి చక్రవర్తి, కొడిశాన విజయకుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి ఇమ్మడి చిన్నవీరభద్రం దుస్తులు సేకరించారు. అదే విధంగా కొర్లగూడెం హెచ్ఎం, అమర్లపూడి చక్రవర్తి చొరవతో.. ఖమ్మం జీవీమాల్ యజమాని గుర్రం సీతతో మాట్లాడగా విశిష్ట ఫౌండేషన్ ద్వారా 8 టర్బో బ్యాగుల నిండా మహిళలకు, పురుషులకు, పిల్లలకు సరిపడా దుస్తులు అందచేయగా ధ్వంసలాపురం గ్రామంలోని 8 వందల కుటుంబాలకు శుక్రవారం అందజేసారు. కార్యక్రమంలో బొమ్మశెట్టి రమేష్, ప్రతిభారెడ్డి, బండి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్..

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్లలో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు శుక్రవారం ఐడియా సేవా సంస్థ ఈ విద్యాలోక్ ట్రస్ట్ సంయుక్తంగా ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ సంస్థల సౌజన్యంతో గత మూడు సంవత్సరాలుగా హైస్కూల్‌లో డిజిటల్ క్లాస్‌లను విద్యార్థులకు బోధిస్తున్నారు. డిజిటల్ క్లాసులు బోధిస్తున్న తరగతి సహాయకురాలు తిరుపతమ్మకు ల్యాప్‌టాప్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐడియా సంస్థ డైరెక్టర్ శౌరి, ఈ విద్యాలోక్ ట్రస్ట్ కోఆర్డినేటర్ రవి, హెచ్ఎం శ్రీనివాస్, సీనియర్ టీచర్ అమర్నాద్, ఉపాధ్యాయులు, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎంతోనే పేదలకు మేలు

ఎర్రుపాలెం: సీపీఎం పోరాటాలతోనే ఎంతో మంది పేదలకు మేలు జరిగిందని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని భీమవరంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం భీమవరం పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నిక చేశారు. గ్రామ శాఖ కార్యదర్శిగా గొల్లపూడి కోటేశ్వరావు, నల్లమోతు హనుమంతరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వీరయ్య, నాయకులు నారాయణ, మోహన్‌రావు, వెంకటనారాయణరెడ్డి, సుబ్బారావు, బేతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఐపీడీఎస్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు.

సిద్ధారంరోడ్ ఫీడర్‌పై ఉన్న ఓల్డ్ యూపీఎస్ రోడ్, రాజబాపయ్యరోడ్, సిద్ధారం రోడ్, వెంకటేశ్వరటాకీస్‌రోడ్, పాలవాడ, శ్రీనివాస టాకీస్‌రోడ్, తుమ్మూరురామారావు వీధి ప్రాంతాల్లో ట్రీకటింగ్ చేపట్టడం జరుగుతున్నందున విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల ప్రక్రియ నిర్వహిస్తున్న క్రమంలో సబ్‌స్టేషన్ పరిధిలోని మామునూరు, రాజుల దేవరపాడు, బుచ్చిరెడ్డిపాలెం, చొప్పకట్లపాలెం, బనిగండ్లపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్థానిక ఏఈ ఆర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్లూరు: కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు కారణంగా శనివారం కల్లూరుటౌన్ 2 గ్రామ పంచాయతీ కార్యాలయం వైపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ వి గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గ కేంద్రాల్లోని బీఆర్ఎస్ నాయకులను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు మందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపు మేరకు నాయకులు నిరసన కార్యక్రమాలు చేయకుండా నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు



కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు


వైరా: పోలీస్‌స్టేషన్‌లో..

'ఏచూరి'కి ఘన నివాళి

నిరంతరం పేదలు, కార్మిక వర్గాల గురించి ఆలోచిస్తూ వర్గ పోరాటాల నిర్వహణలో కీలకపాత్ర పోషించిన మహా నాయకుడు సీతారం ఏచూరి అని అఖిలపక్ష నాయకులు తెలిపారు. శుక్రవారం పలు చోట్ల నిర్వహించిన ఏచూరి సంతాభ సభలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని.. ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా: ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


మధిర: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


తల్లాడలో..


చింతకాని: సీపీఎం కార్యాలయంలో..